ఒకే రోజు 15,290 టన్నుల బొగ్గు రవాణా

కాకతీయఖని, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి ఏరియా గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ నెల 25న బొగ్గు ఉత్పత్తిని సాధించి, రవాణా చేపట్టామని సింగరేణి జీఎం ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకే రోజు 15,290 టన్నుల బొగ్గు రవాణా పేర్కొన్నారు. అందుకు సహకరించిన అధికారులకు, కార్మికులకు, కార్మిక సంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాగే కృషిచేస్తూ రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తిని సాధించాలని, యాజమాన్యం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు.





- ఓంకారనాదంతో మార్మోగిన శైవ క్షేత్రాలు
- వెల్లివిరిసిన భక్తిపారవశ్యం
- ఘనంగా మహాశివరాత్రి పర్వదినం
- కిటకిటలాడిన ఆలయాలు
- శివనామంతో హోరెత్తిన శైవక్షేత్రాలు





రామప్ప ఆలయంలో స్వామి వారి కల్యాణ మహత్సవంలో మంత్రి సీతక్క

కాళేశ్వర ఆలయంలో ఉత్సవ మూర్తులు, కల్యాణ తంతులో తాళిని చూపుతున్న ప్రధాన అర్చకుడు కృష్ణమూర్తి శర్మ

మహదేవపూర్/గణపురం/భూపాలపల్లి కలెక్టరేట్ ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): శైవక్షేత్రాలన్నీ శివనామంతో హోరెత్తాయి. జిల్లాలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని భక్తులు ప్రత్యేకపూజలు చేశారు. దక్షిణ కాశీగా పేరొందిన మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం పుణ్యక్షేత్రానికి పోటెత్తారు. గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి పరమశివుణి పూజించి ప్రసన్నం చేసుకున్నారు. కాకతీయుల కాలం నాటి గణపురం మండలంలోని కోటగుళ్లకు భక్తులు భారీగా తరలివచ్చారు. అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, ఓఎస్‌డీ బోనాల కిషన్, డీఎస్పీ సంపత్‌రావు, సీఐ నరేష్, ఎస్సై అశోక్ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. గణపురం మండలంలో బుద్దారంలో శివరాత్రి వేడుకలకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు-పద్మ దంపతులు హాజరయ్యారు. పార్వతీ పరమేశ్వరుల కల్యాణలో పాల్గొన్నారు. అలాగే జిల్లా కేంద్రం భూపాలపల్లి, కాటారం, గణపురం, రేగొండ, చిట్యాల, మహాముత్తారం, టేకుమట్ల, మహదేవ్‌పూర్, మల్హర్, మొగుళ్లపల్లి మండలాల్లో శివారాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. శివాలయాలకు భక్తులు బారులుతీరి ప్రత్యేక పూజలు చేశారు.



కాళేశ్వరాలయ ప్రాంగణంలో జరిగిన కల్యాణంలో కలెక్టర్ దంపతులు, భక్తులు

అంగరంగ వైభవంగా శుభానందదేవి కల్యాణం

త్రిలింగాలలో ఒకటిగా, మూడు నదుల కలయిక వద్ద, మూడు రాష్ట్రాల సరిహద్దు వెలిసిన కాళేశ్వర ఆలయంలో శుభానంద ముక్తీశ్వర కల్యాణ మహోత్సవం కనులపండువగా జరిగింది. బుధవారం సాయంత్రం 5 గంటలకు శుభానందముక్తీశ్వర కల్యాణ మహత్సవాన్ని ఆలయ అర్చకులు నగేష్‌శర్మ, ప్రధాన అర్చకులు కృష్ణమూర్తి శర్మ, ఉప ప్రధాన అర్చకులు ఫణీంద్రశర్మ, రామకృష్ణతో పాటు పలువురు అర్చకులు వైకుంఠ పాండ, సుబ్రమణ్యశర్మ, కాకిరాల పవన్‌శర్మ, శ్యాంశర్మతో పాటు అర్చకులు వేద మంత్రాలు, మంగళవాయిద్యాలు, బాజా బజంత్రీల నడుమ కల్యాణం జరిపించారు. ముఖ్య అతిథిగా భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ దంపతులు హాజరయ్యారు. స్వామి వారికి తలంబ్రాలు తీసుకొచ్చి, భక్తులతో కలిసి కల్యాణోత్సవాన్ని తిలకించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈవో మహేష్ పర్యవేక్షించారు. ఈ కల్యాణ మహోత్సవానికి మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు.



విద్యుత్ కాంతులతో కళకళలాడుతున్న కోటగుళ్లు



కాళేశ్వరాలయ ఆవరణలో భక్తుల రద్దీ



రామప్ప ఆలయంలో..

శంభో శివ శంభో..

మార్మోగిన శివనామం
శైవ క్షేత్రాల్లో భక్తుల కోలాహలం
ఘనంగా శివరాత్రి వేడుకలు

ములుగు/వెంకటాపూర్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన ములుగు జిల్లా హరుడి స్మరణతో మార్మోగింది. శివాలయాలు, ప్రముఖ శైవ క్షేత్రాలల్లో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. పరమేశ్వరుడిని దర్శించుకున్న భక్తులు అభిషేకాలు, అర్చనలతో కొలుచుకున్నారు. ప్రఖ్యాత రామప్ప దేవాలయంలో శివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఉదయం నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. వేలాదిగా తరలివచ్చిన భక్తులు రుద్రేశ్వరుడిని దర్శించుకొని పూజలు చేశారు. రాత్రి పార్వతీ పరమేశ్వరుల కల్యాణం కనుల పండువగా జరిగింది. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృది శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క దేవతలకు పట్టువస్త్రాలను సమర్పించారు. ములుగులోని పురాతన నగరేశ్వరస్వామి, మంగపేటలోని ఉమాచంద్రశేఖర స్వామి ఆలయాలతోపాటు ఆయా మండలాల్లోని శివాలయాలు భక్తులతో సందడిగా మారాయి. ఆలయ కమిటీలు, ఉత్సవ మండళ్ల ఆధ్వర్యంలో జాగరణ భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈసారి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించలేదు. ఆలయ ప్రాంగణాల్లో రాత్రంగా జాగరణ చేసిన భక్తులు శివపార్వతులను స్మరిస్తూ భజనలు చేశారు.

రామప్పలో కల్యాణోత్సవం

రామప్ప రామలింగేశ్వరస్వామి సన్నిధిలో బుధవారం రాత్రి 10 గంటలకు శివపార్వతుల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. శ్రీభవాని సైత రామలింగేశ్వరస్వామి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కల్యాణం కోసం పట్టు వస్త్రాలను ఆలయ న ఇన్‌స్పెక్టర్ కవిత, కార్యనిర్వహణాధికారి బిల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో అందించగా స్వామి వారిని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క చేతుల మీదుగా అలంకరించారు. భక్తుల భజనలు, మంగళవాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు హరీశ్ శర్మ, ఉమాశంకర్‌ల ఆధ్వర్యంలో రామలింగేశ్వరస్వామి కల్యాణం కమనీయంగా కొనసాగింది. సాయంత్రం భక్తుల తాకిడి ఎక్కువ కావడంతో పోలీసులు క్యూలైన్ల ద్వారా దర్శించుకున్నారు. శివపార్వతుల కల్యాణాన్ని తిలకించేందుకు సుమారు 50 వేలమంది భక్తులు విడిది చేయడంతో రామప్ప ఆలయ గార్డెన్ కిటకిటలాడింది. కల్యాణ మహోత్సవంలో వివిధ శాఖల అధికారులు, భక్తులు పాల్గొన్నారు.



ములుగులోని నగరేశ్వర స్వామి దేవాలయంలో గౌరీశంకరులకు కల్యాణం జరిపిస్తున్న పండితులు, పాల్గొన్న భక్తులు

పాముకాటుతో చిన్నారి మృతి



కీర్తన (ఫైల్)

చిట్యాల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పాము కాటుకు గురై చిన్నారి మృతి చెందిన ఘటన మండలంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. గిద్దెముత్తారం గ్రామానికి చెందిన కిన్నెర రాజు, శిరీష దంపతుల పెద్ద కుమార్తె కీర్తన (7) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతోంది. మంగళవారం రాత్రి తల్లితో కలిసి ఇంట్లో నిద్రించింది. అర్ధరాత్రి సమయంలో చిన్నారిని కట్లపాము కాటేసింది. కాలు నొప్పిగా ఉందని పక్కనే మంచంపై నిద్రిస్తున్న తండ్రి రాజును నిద్రలేపింది. ఇంట్లో వస్తువులను కదిలించగా పాము కనిపించడంతో దానికి చంపేశారు. చిన్నారిని చిట్యాల సామాజిక ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు ప్రథమ చికిత్స చేసి వెంటిలేషన్ అవసరం అవుతుందని భూపాలపల్లి 100 పడకల ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఆస్పత్రిలో కీర్తనను పరీక్షించిన వైద్యులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి తీసుకువెళ్లాల్సిందిగా సూచించడంతో అక్కడికి తరలించారు. అక్కడ చికిత్స అందిస్తున్న క్రమంలో కీర్తన బుధవారం తెల్లవారుజామున మృతి చెందింది.

ఆలస్యమే విషమై...

చిన్నారి మృతికి ఆలస్యమే కారణమనే చర్చ కొనసాగుతోంది. పాము కాటేసిందని తెలిపిన చిన్నారిని అక్కడే ఆస్పత్రికి తరలించకుండా పామును చంపి చిట్యాల ఆస్పత్రికి తీసుకువెళ్లినట్లు తెలిసింది. అక్కడి నుంచి భూపాలపల్లి జిల్లా ఆస్పత్రికి, అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం ఆస్పతికి తరలించేలోగా సకాలంలో సరైన వైద్యం అందకపోవడంతో విష ప్రభావం ఎక్కువై కీర్తన మృతి చెందిందని గ్రామస్థులు అంటున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు రెడీ



రిసెప్షన్ సెంటర్ వద్ద వివరాలు నమోదు చేసుకుంటున్న ఎన్నికల సిబ్బంది

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ఓటు హక్కును వినియోగించుకోనున్న 2,895 మంది
- ఎన్నికల విధుల్లో 99 మంది సిబ్బంది
- ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్
- కలెక్టరేట్ నుంచి తరలిపోయిన సామగ్రి

భూపాలపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి26(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, పట్టాభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధమైంది. వరంగల్- ఖమ్మం- నల్లగొండ, మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్, కరీంనగర్ ఉపాధ్యాయ, పట్ట భద్రుల ఎన్నికలకు గురువారం పోలింగ్ జరగనుంది. భూపాలపల్లి జిల్లాలోని 2,895 మంది ఉపాధ్యాయులు, పట్టభద్రులు తమం ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా అధికారులు 17 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ ప్రక్రియ సాజావుగా నిర్వహించేందుకు 99 మంది పోలింగ్ సిబ్బంది విధుల్లో పాల్గొనున్నారు. ఈ క్రమంలో కలెక్టరేట్ నుంచి ఆయా పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని అధికారులు బుధవారం తరలించారు. గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగనుంది.

జిల్లాలో 2,895 మంది ఓటర్లు

పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం సమాయత్తమైంది. వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎన్నికలో భూపాలపల్లి, చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి, రేగొండ, గణపురం, గోరికొత్తపల్లి మండలాలకు చెందిన 329 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వీరిలో 218 మంది పురుష ఓటర్లు ఉండగా, 114 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. మెదక్-నిజామాబాద్- ఆదిలాబాద్- కరీంనగర్ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాటారం, మల్హర్, మహాముత్తారం, పలిమెల, మహాదేవపూర్ మండలాలకు చెందిన ఉపాధ్యాయులు, పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం 83 మంది ఓటు వేయనున్నారు. వీరిలో 64 మంది పురుషులు, 19 మంది మహిళలు ఉన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం 2,483 మంది ఓటర్లు ఉండగా వీరిలో అత్యధికంగా 1,734 మంది పురుషులు, 749 మంది మహిళలు ఉన్నారు. ఎమ్మెల్సీ

» మిగతా 8వ పేజీలో...



పోలింగ్ కేంద్రాలకు తరలిస్తున్న బస్సును ప్రారంభిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ



ఎన్నికల సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు తరలిస్తున్న సిబ్బంది

ఒక ఓటరు.. ఎనిమిది మంది సిబ్బంది

మహదేవపూర్ రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పలిమెల మండలంలో విచిత్రం చోటుచేసుకుంది. మండల వ్యాప్తంగా పదికి పైగా పాఠశాలలు ఉన్నప్పటికీ ఇక్కడ అన్ని ప్రైమరీ పాఠశాలలే ఉన్నాయి. పంకెనలో ఒకే ఒక్క అప్పర్ ప్రైమరీ స్కూల్ (యూపీఎస్) ఉండగా అందులో ఒకే ఒక్క ఉపాధ్యాయుడు ఓటరుగా నమోదయ్యాడు. ఆయన ఒక్కరి కోసం ఐదుగురు పోలింగ్ సిబ్బంది, ఒక రూట్ ఆఫీసరు, భద్రత పరంగా ఇద్దరు పోలీసులను కేటాయించారు. గురువారం పోలింగ్ జరగనుండగా మొత్తంగా ఒకే ఒక్క ఓటరు కోసం ఎనిమిది మంది సిబ్బందిని ఉన్నతాధికారులు ఆ పోలింగ్ సెంటర్‌కు బుధవారం పంపారు. ఆ ఒక్క ఓటరు కోసం ఎనిమిది మంది సిబ్బందిని కేటాయించే బదులు.. ఆయన్నే పక్కనే ఉన్న మహదేవపూర్ మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రానికి పంపి ఓటు వేసేలా చర్యలు తీసుకుంటే సరిపోయేది కదా? అని పలువురు అభిప్రాయ పడ్డారు.

బలంగా బహుజనవాదం : ఇంటలెక్చువల్ ఫోరమ్

పూల రవీందర్‌కు బహుజనుల మద్దతు అని విశ్వాసం

నల్లగొండ, ఫిబ్రవరి 26: ఉమ్మడి వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మునుపెన్నడూ లేని విధంగా బహుజనవాదం గెలుస్తుందని బహుజన మేధావులు విశ్వసిస్తున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల్లో గతానికి భిన్నంగా ప్రచారంలో ఈ వాదం పనిచేసిందని అభిప్రాయపడుతున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఆర్.కృష్ణయ్య, విశ్రాంత ఐఏఎస్ చిరంజీవులు తదితరులు ఈ ఎన్నికల్లో బీసీ, బహుజన వాదాన్ని బలంగా ప్రచారం చేయడంతో ఈ సానుకూలత వచ్చిందని భావిస్తున్నారు. బీసీ అభ్యర్థి పూల రవీందర్ గెలుపు ద్వారా రాష్ట్ర రాజకీయాలు మలుపు తిరుగుతాయని, ఇది బీసీ రాజ్యాధికార వాదానికి దోహదపడుతుందని చెబుతున్నారు. 35 పైగా ఉపాధ్యాయ, అధ్యాపక, ఆచార్య సంఘాల మద్దతుతో బహుజన అభ్యర్థిగా రంగంలో ఉన్న పూల రవీందర్ గెలుపునకు ఈ నినాదం దోహదపడుతుందని చెప్పారు.

విద్యారంగంలో రవీందర్ ప్రస్థానం

పూల రవీందర్ సాధారణ ఉపాధ్యాయుడిగా ప్రస్థానాన్ని ప్రారంభించి, పీఆర్టీయూ మండలాధ్యక్షుడిగా, ఉమ్మడి నల్లగొండ జిల్లా, రాష్ట్ర అధ్యక్షుడిగా, తెలంగాణ ఉద్యమంలో టీటీజేఏసీ చైర్మన్‌గా, ఆరేళ్ల ఎమ్మెల్సీగా పనిచేశారు. ఈ కాలంలో ఉపాధ్యాయుల పలు సమస్యల పరిష్కారానికి కృషి చేసిన విషయాన్ని బలంగా తీసుకెళ్లగలిగామని బీసీ నేతలు శీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో పీఆర్టీయూ సంఘంలోని వర్గ విభేదాలతో ఓటమిపాలైనా, గడిచిన ఆరేళ్ల రవీందర్ ఆ సంఘంలోనే ఉంటూ ఉపాధ్యాయులకు అండగా ఉంటూ వచ్చారన్నారు. 010 ద్వారా ఉపాధ్యాయులకు వేతనాలు, మహిళా ఉపాధ్యాయులను చైల్డ్‌కేర్ సెలవులు, పండిట్, పీఈటీ అప్ గ్రేడేషన్, కేజీబీవీ ఉపాధ్యాయులకు 12 నెలల వేతనం, వివిధ పీఆర్సీ కాలాల్లో మెరుగైన ఫిట్‌మెంట్ సాధన, మోడల్ స్కూల్స్, ఆశ్రమ పాఠశాలల, గురుకులాల సిబ్బందికి ఉపయుక్తమైన ఎన్నో జీవోల వెనక రవీందర్ కృషి ఉందనేది ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఆయనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని(సీపీఎస్), యూనిఫైడ్ పెన్షన్ సిస్టమ్(యూపీఎస్)ను రద్దు చేస్తూ పాత పెన్షన్ విధానాన్ని(ఓపీఎస్) పునరుద్ధరించడానికి కృషి చేస్తారని, పీఆర్సీలో ఉద్యోగ ఉపాధ్యాయులకు 51 శాతం ఫిట్‌మెంట్‌తో నూతన పీఆర్సీ ఇప్పించడానికి కృషి చేస్తారన్నారు. మోడల్ స్కూల్, కేజీబీవీ, అర్బన్ రెసిడెన్షియల్స్ ఉపాధ్యాయుల పరిష్కారానికి కృషి చేస్తారని పేర్కొన్నారు. ప్రతీ పాఠశాలలను సందర్శించి మొదటి ప్రాధాన్య ఓటు వేయాలని అభ్యర్థిస్తుంటే బహుజన బిడ్డగా పుట్టినందుకు, పోటీ చేస్తున్నందుకు తాను గర్వపడుతున్నానని పూల రవీందర్ పేర్కొంటున్నారు. గురువారం జరిగే ఎన్నికల్లో ఉపాధ్యాయులంతా తనను ఆదరిస్తారని ఆయన ఆశిస్తున్నారు.



సూర్యాపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్

బైక్ అదుపు తప్పి మహిళ మృతి

మహదేవపూర్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్ నుంచి కాళేశ్వరం వెళ్లే రహదారిలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఓ మహిళ మృతి చెందింది. వాహనం నడుపుతున్న ఆమె భర్త తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి మండలం జంగేడు గ్రామానికి చెందిన సమ్మెట సమ్మయ్య తన భార్య భాగ్య(50)తో కలిసి కాళేశ్వరాలయానికి బైక్‌పై బయల్దేరారు. ఈ క్రమంలో మహదేవపూర్ నుంచి కాళేశ్వరం వెళ్లే దారిలో మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. దీంతో ఇద్దరూ కింద పడి పోయారు. వీరిని 108 అంబులెన్స్ ద్వారా మహదేవపూర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే భాగ్య మృతిచెందిందని వైద్యులు నిర్ధారించారు. సమ్మయ్య తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసును నమోదు చేశారు.

నేడు అమెరికాలో ఉద్యోగ అవకాశాలపై సదస్సు

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో ఫిబ్రవరి 27న సాయంత్రం 4 గంటలకు 'ఎక్స్‌ప్లోరింగ్ కెరీర్ అపర్చ్యూనిటీస్ ఇన్ ది యూఎస్' అనే అంశంపై ఫార్మసీ, ఇంజనీరింగ్, కామర్స్, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులతో పాటు సోషల్ సైన్స్ విద్యార్థులకు సదస్సు నిర్వహిస్తున్నట్లు కేయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్.ప్రసాద్ బుధవారం తెలిపారు. సదస్సులో కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని, అలాగే విశిష్ట అతిథిగా కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం హాజరవుతారని వెల్లడించారు. వీరితోపాటు కేయూ అలూమినీ, అమెరికా ఐటీ రంగ నిపుణులు, ప్రముఖ వ్యాపారవేత్త పులి రవి హాజరై సోషల్ సైన్స్ విద్యార్థులకు ఐటీ నైపుణ్యాలు, ఉద్యోగాలు అనే అంశంపై విస్తృత ఉపన్యాసం చేస్తారని వెల్లడించారు. అలాగే యూఎస్ కన్సల్టెంట్ అధికారి జెన్నీఫర్ లార్సన్ అమెరికాలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు వీసీ నిబంధనలు, అడ్మిషన్ల ప్రాసెస్, అమెరికాలో భారతీయ విద్యార్థులకు లభించే అవకాశాలతో పాటు అభ్యర్థులకు ఏది అనుకూలం అనే విషయాలపై కూలంకశంగా మాట్లాడుతారని వివరించారు. సదస్సులో విద్యార్థుల సందేహాలపై పులి రవి, జెన్నీఫర్ లార్సన్‌లు సమాధానాలు ఇస్తారని పేర్కొన్నారు. సదస్సుకు కేయూ కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.రమణ, మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భిక్షాలు వ్యవహరిస్తారు.

శివుడికి బిహార్ కార్మికుల జలాభిషేకం


విలేజీ కేసముద్రం వైకుంఠధామంలోని శివుడి విగ్రహానికి జలాభిషేకం చేస్తున్న బిహార్ కార్మికుడు

కేసముద్రం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : శివుడి ఆవాస ప్రాంతమైన శ్మశానంలో ఏర్పాటు చేసిన గరళకంఠుని విగ్రహానికి మహాశివరాత్రి సందర్భంగా బిహార్‌కు చెందిన పలువురు కార్మికులు జలాభిషేకం చేశారు. కేసముద్రం విలేజి వైకుంఠ దామంలో శివుడి విగ్రహాన్ని కొద్దినెలల క్రితం ఏర్పాటు చేశారు. వైకుంఠదామానికి ఎదురుగానే ఓం శ్రీసాయి రైస్ మిల్లులో పనిచేసే బిహార్ రాష్ట్రానికి చెందిన ఏడుగురు కార్మికులు ప్రతీ సోమవారం తమ ఇష్ట దైవమైన శివుడి విగ్రహం అందుబాటులో ఉండడంతో పూజలు నిర్వహిస్తుంటారు. ఇదే క్రమంలో శివరాత్రి సందర్భంగా ప్రత్యేకంగాజలాభిషేకం చేయడం, ఈవీడియోలు స్థానికసామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడం విశేషం.

సోమసూత్రం మరమ్మతులపై అధికారుల నిర్లక్ష్యం



ఆలయంలో శివలింగం వద్ద ఏర్పాటు చేసిన డ్రమ్ములో నిలిచిన నీరు, చిత్తడిగా మారిన గర్భగుడి, బాలుడికి వైద్యసేవలందిస్తున్న డాక్టర్

వెంకటాపూర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రామప్పలోని రామలింగేశ్వరుడికి అభిషేకం నిర్వహించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వారికి మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని అధికారులు చెబుతున్నా, పరిస్థితులు అందుకు విరుద్ధంగా కనిపించాయి. అభిషేకం నీరు బయటకుపంపే సోమసూత్రం మరమ్మతు పనులు నిలిచిపోవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. నీరు బయటకు వెళ్లే మార్గం లేక ఆలయ ప్రాంగణమంతా చిత్తడిగా మారింది. భక్తులు అభిషేకం చేసిన నీరు గర్భగుడిలో ఏర్పాటుచేసిన ప్లాస్టిక్ డ్రమ్ములోకి చేరుకుంటుంది. భక్తులు అధిక సంఖ్యలో అభిషేకాలు నిర్వహించడంతో తరచూ డ్రమ్ము నిండిపోతుంది. దీంతో దేవాదాయ శాఖ సిబ్బంది భక్తుల క్యూలైన్ మధ్యలో నుంచే ఖాళీ చేయడంతో గర్భాలయంతోపాటు ఆలయ ప్రాంగణమంతా చిత్తడిగా మారింది. నీటిని ఖాళీచేసే సమయంలో భక్తులను కూడా అభిషేకానికి అనుమతించకపోవడంతోక్యూలైన్లలో ఎక్కువ సేపు నిల్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

సొమ్మసిల్లిన ఇద్దరు భక్తులు

పెద్దసంఖ్యలో క్యూలైన్లలో భక్తులు రావడం, ఎండ వేడిమి తట్టుకోలేక ఓ బాలుడితోపాటు వృద్ధురాలు సొమ్మసిల్లి పడిపోయారు. వెంటనే అక్కడున్న సిబ్బంది ఇద్దరిని మెడికల్ క్యాంపుకు తరలించారు. బాలుడి పరిస్థితి నిలకడగానే ఉందని క్యాంప్ డాక్టర్ లోకప్రియ, పీహెచ్ఎంలు శోభ, సులోచన, సుశీల తెలిపారు. ఆలయంలో ఏర్పాటు చేసిన క్యూలైన్‌లో మంచినీటి సౌకర్యం లేకపోవడంతో వృద్ధురాలు కిందపడిపోయింది. వెంటనే పక్కన ఉన్న భక్తులు ఆమెను బయటకు తీసుకొచ్చి సేవ చేశారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగానే ఉంది. ఆలయంలో తాగునీటి సౌకర్యం లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గంగమ్మ ఆలయంలో ఘనంగా పూజలు


గంగమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న గిరిజనులు

గంగారం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : గంగారం గ్రామ శివారులోని కొండపైన వెలసిన గంగమ్మ ఆలయంలో శివరాత్రి పర్వదినం సందర్భంగా గిరిజనులు బుధవారం ఘనంగా పూజలు చేశారు. ఉదయం ఆలయ ప్రధాన పూజారి జెజ్జరి లక్ష్మీనర్సు ఇంటిలో తలంబ్రాలు తయారు చేసి, గిరిజన సంప్రదాయాలతో ఊరేగింపుగా గంగమ్మ ఆలయానికి తీసుకు వెళ్లారు. అక్కడ శివలింగానికి పూజలు చేసిన గిరిజనులు బుధవారం రాత్రి శివ పార్వతులకు కల్యాణం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జెజ్జరి మల్లన్న, రాము, విజయ్, చింతా రవి, కుంజా నరేష్, జెజ్జరి వెంకటయ్యలు పాల్గొన్నారు.

జనగామలో కిడ్నాప్ కలకలం

- చిన్నారిని ఎత్తుకెళ్లిన దంపతులు

జనగామ రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా కేంద్రంలో కిడ్నాప్ ఉదంతం కలకలం సృష్టించింది. వివరాల్లోకి వెళితే... జనగాముకు చెందిన ఓ వ్యాపారి జిల్లా కేంద్రంలోని క్లౌం రోడ్డులో నూతనంగా ఫంక్షన్ హాల్ నిర్మిస్తున్నాడు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన భవన నిర్మాణ కార్మికులు పార్వతి-రాంజూల్ దంపతులు కొంత కాలంగా కూలీ పనులు చేసుకుంటూ నిర్మాణంలో ఉన్న ఫంక్షన్‌హాల్ వద్ద నివసిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 20 రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సురేశ్ తన భార్యతో కలిసి ఫంక్షన్ హాల్ నిర్మాణంలో పని చేయడానికి వచ్చి వారు కూడా అక్కడే ఉంటున్నారు. కాగా, సురేశ్ దంపతులకు సంతానం లేకపోవడంతో పార్వతి దంపతుల 10 నెలల చిన్న కుమార్తె శివాణితో సన్నిహితంగా ఉంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి శివాణికి చాక్లెట్స్, బిస్కెట్లు ఆశ జూపి సమీపంలోని కిరాణా షాపుకు తీసుకెళ్లి అటునుంచి అటే వెళ్లిపోయారు. ఎంత సేపటికీ వారు ఇంటికి రాకపోయే సరికి అనుమానం వచ్చిన పార్వతి దంపతులు పాపను ఎత్తుకెళ్లినట్లు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ దామోదర్‌రెడ్డి తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


వీరన్న మృతదేహం

గూడూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం గూడూరు మండలం కొల్లాపురంలో చోటుచేసుకుంది. ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... కొల్లాపురం గ్రామానికి చెందిన పిట్టల వీరన్న(40) చేపలు పట్టి విక్రయిస్తూ, కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఆటో ట్రాలీని రూ.5.50 లక్షలకు ఫైనాన్స్ ద్వారా కొనుగోలు చేశాడు. ప్రతీనెల కిస్తీలు కట్టడం ఇబ్బంది కావడంతో మూడ్రోజుల క్రితం వీరన్న భార్య జయమ్మ నువ్వు సంపాదించేది మొత్తం నీ ఆటోకే కిస్తీలు కట్టడం జరుగుతుందని మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన వీరన్న తన వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు, కుటుంబసభ్యులు హుటాహుటిన జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం వీరన్న మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భార్య జయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

శిశువు విక్రయంపై కలకలం

- 'ఆంధ్రజ్యోతి' కథనంతో చర్చనీయాంశం


పాపకు 3 లక్షలు.. బాబుకు 5 లక్షలు

ఆంధ్రజ్యోతి మెయిన్‌లో ప్రచురితమైన కథనం

కేసముద్రం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలకేంద్రంలో శిశువు విక్రయం కలకలం రేపింది. రాష్ట్ర రాజధానిలో శిశువులను విక్రయించే ముఠా పోలీసులకు పట్టుబడడం, అందులో కేసముద్రంకు చెందిన వారున్నట్లు బుధవారం 'ఆంధ్రజ్యోతి' మెయిన్‌లో హైదరాబాద్ నుంచి కథనం ప్రచురితం కావడంతో స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. కేసముద్రానికి చెందిన వారు ఎవరని పలువురు ఆరా తీశారు. అంబేడ్కర్ సెంటర్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి కొద్దిరోజుల క్రితం మగశిశువు తమకే జన్మించాడని ఇరుగుపొరుగు వారికి చెప్పినట్లు తెలిసింది. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం తెల్లవారుజామునే హైదరాబాద్ నుంచి పోలీసులు వచ్చి శిశువును, సదరు వ్యక్తిని తరలించారు. హైదరాబాద్ ముఠా ద్వారానే సదరు శిశువును కొనుగోలు చేసినట్లు పోలీసులు నిర్ధారణకు రాగా అక్కడి పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం.

కూతురితో సహా బావిలో దూకిన తల్లి

- తల్లి క్షేమం... రెండేళ్ల పాప మృతి
- కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం
- జనగామలో పండుగ పూట విషాదం


శ్రీప్రగతి (ఫైల్)

జనగామ రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో వివాహిత క్షణికావేశంతో చేసిన ఆత్మహత్యాయత్నానికి అభం శుభం తెలియని రెండేళ్ల పాప మృతి చెందిన ఘటన జనగామ మండలంలో చోటు చేసుకుంది. తరిగొప్పుల మండలం నర్సాపూర్‌కు చెందిన ఎడ్ల శోభ, యాదయ్య దంపతుల కుమార్తె గౌరిప్రియకు నాలుగు సంవత్సరాల క్రితం జనగామ మండలం గానుగుపహాడ్‌కు చెందిన ఆకుల రమేశ్‌తో వివాహం జరిగింది. పెళ్లి జరిగినవప్పటి నుంచి కుటుంబ కలహాలతో భార్య భర్తలకు తరచూ గొడవలు కావడంతో గౌరిప్రియ పుట్టింటికి వెళ్లిపోయింది. ఇరువురికి పెద్ద మనుషులు సర్దిచెప్పడంతో కొద్ది రోజులుగా భార్యాభర్తలు కలిసి ఉంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి భార్యాభర్తలకు గొడవ జరగడంతో మనస్థాపం చెందిన గౌరిప్రియ తన కూతురు శ్రీప్రగతి(2)తో కలిసి బుధవారం తెల్లవారుజామున గానుగుపహాడ్ గ్రామ శివారులోని ఓ వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించి ఇద్దరిని బయటకు తీయగా శ్రీప్రగతి బావిలోని నీరు మింగి మృతి చెందింది. గౌరిప్రియకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం జనగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి ఎస్ఐ రాజేష్ కుమార్ చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కళాశాలలో విద్యార్థిని ఆత్మహత్య

వరంగల్ వ్యవసాయం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ వ్యవసాయ కళాశాలలో బీఎస్సీ మొదటి సంవత్సరం చదువుతున్న గంటోజు రేస్మిత(19) ఆత్మహత్య చేసుకుంది. బుధవారం ఉదయం తానుంటున్న హాస్టల్ గదిలో ఫ్యానుకు ఉరేసుకుంది. తోటి విద్యార్థులు, పోలీసుల కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లాకేంద్రంలోని రాక్‌హిల్స్ కాలనీకి చెందిన రేస్మిత ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీకి అనుబంధంగా నడుస్తున్న వరంగల్ వ్యవసాయ కళాశాలలో చదువుకుంటోంది. అయితే రేస్మితకు వరంగల్‌లో చదువుకోవడం ఇష్టం లేకపోయినా తల్లిదండ్రులు నచ్చచెప్పి పంపించారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం తానుంటున్న హాస్టల్ గది తలుపులు ఎంతకూ తీయకపోవడంతో విషయం తెలుసుకున్న కళాశాల అధికారులు రేస్మిత తండ్రితో పాటు ఏనుమాముల పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెంటనే చేరుకుని గది తలుపులు పగులకొట్టి చూడగా అప్పటికే రేస్మిత ఫ్యాన్‌కు వేలాడుతోంది. కళాశాలకు వచ్చిన తండ్రి సత్యనారాయణ కూతురిని చూసి బోరున విలపించారు. ఈ మేరకు ఎస్‌హెచ్‌వో రాఘవేందర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- విలువైన పత్రాలు, లక్ష నగదు అగ్గిపాలు


గున్నేపల్లిలో షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైన రేకుల ఇల్లు

దంతాలపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గున్నేపల్లిలో బుధవారం షార్ట్ సర్క్యూట్‌తో రేకుల ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. స్థానికుల కథనం ప్రకారం.... గ్రామానికి చెందిన బాషపాక వెంకటమ్మకు చెందిన రేకుల ఇంట్లో ఉదయం 9 గంటల ప్రాంతంలో ఒకేసారి విద్యుత్ మంటలు రావడం గమనించిన వెంకటమ్మ స్థానికులకు చెప్పేసరికి ఇంట్లో ఉన్న విలువైన పత్రాలు, రూ.1లక్షతో పాటు బియ్యం, నిత్యావసర సరుకులు, దుస్తువులు పూర్తిగా మంటల్లో కాలిపోయాయి. ఇటీవలే వెంకటమ్మకు గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయడంతో ఆ ఇళ్ల ప్రస్తుతం నిర్మాణ దశలోనే ఉంది. ఆ ఇల్లు పక్కనే రేకులు వేసుకొని ఉంటున్నారు. ఈ క్రమంలో రేకుల ఇంట్లో షార్ట్ సర్క్యూట్ జరగడంతో వెంకటమ్మ లబోదిబోమంటూ పలువురిని ఆదుకోవాలని వేడుకున్నారు. రెడ్‌క్రాస్ జిల్లా కార్యవర్గం స్పందించి సంఘటనా స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వెంకటమ్మ కుటంబానికి పదిహేను రోజులకు సరిపడే నిత్యావసర సరుకులు, దుస్తువులను రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు, ఛైర్మన్ వరప్రసాద్, కోశాధికారి వెంకటరెడ్డి, పొన్నాల ఉమేష్ అందించారు.

అడవిపై ఆదివాసీలకే హక్కు

- తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ సిద్దబోయిన లక్ష్మీనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

వడ్డేపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలో తరతరాలుగా జీవన మనుగడ కొనసాగిస్తున్న ఆదివాసీలకే అడవిపై పూర్తి హక్కులను కల్పించాలని తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ సిద్దబోయిన లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్‌లోని గోపాల్‌పూర్‌లో నిర్వహించిన తుడుందెబ్బ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగంలో పొందుపర్చిన ఆదివాసీల హక్కులు, చట్టాలు విధ్వంసం అవుతున్నాయని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని భూములు, ఖనిజ సంపద కార్పొరేట్ శక్తులకు పాలక ప్రభుత్వాలు ధారాదత్తం చేస్తున్నాయని దుయ్యబట్టారు. గోండు వీరుడు, ఆదివాసీ ముద్దు బిడ్డ కొమురంభీం యుద్ధభూమి అయిన ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం జోడెన్ ఘాట్‌లో ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించే తుడుందెబ్బ రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలని ఆదివాసీలకు పిలుపునిచ్చారు. ఈ మహాసభలలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, ప్రొఫెసర్ ఖాసీం, ప్రముఖ న్యాయవాది త్రినాథరావులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సమావేశంలో తుడుందెబ్బ స్టేట్ కోకన్వీనర్లు ఆగబోయిన రవి, కొట్నాక విజయ్, గోగల కోటయ్య, ఎస్.సంజీవ్ పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం

ఇనుగుర్తి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తి మండల కేంద్రంలోని బ్రహ్మంగారి గుడిలో బుధవారం వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ కల్యాణోత్సవం బొల్లోజు ప్రభాకరాచారి దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం గ్రామ వీధుల్లో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కాయితోజు ఉమేష్, అక్కర హరీష్, తుమ్మనపల్లి పూర్ణాచారి, రాజు, శ్రీనివాసాచారి, నరేష్, సొక్కయ్యచారి, బొల్లోజు చంద్రయ్య పాల్గొన్నారు.

ఓటుకు నోటు తీసుకుంటున్నారా.. తస్మాత్ జాగ్రత్త..!

- ఉపాధ్యాయుల వాట్సాప్ గ్రూపుల్లో వైరల్
- నేరుగా డబ్బులు ఇవ్వాలంటూ డిమాండ్



వరంగల్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : 'ఓటుకు నోటు తీసుకుంటున్నారా...? తస్మాత్ జాగ్రత్త...!' 'ఓటును నమ్ముకోవాలి... అమ్ముకోవద్దు...' అంటూ పంతుళ్ల వాట్సాప్ గ్రూపుల్లో మంగళవారం సాయంత్రం నుంచి ఓ మెసేజ్ వైరల్ అవుతోంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పంతుళ్ల పరాకుగా ఉండకుండా ప్రలోభాలకు లోబడి ఓటుకు నోటు తీసుకున్నా.. అభ్యర్థుల నుంచి డబ్బులు తీసుకొని పంపిణీ చేసినా.. వారిపై చర్యలు తప్పవనే వాట్సాప్ మెసేజ్‌లు హల్‌చల్ చేస్తున్నాయి. పంతుళ్లకు సంబంధించిన జీతభత్యాలు, తదితర లావాదేవీలు నిర్వహించే ఖాతాలన్నీ ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయని, ఖాతాల్లో అప్పనంగా జమవుతున్న డబ్బుల వివరాలను ప్రభుత్వం సేకరిస్తుందనే చర్చలు పంతుళ్ల వర్గంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలోని పంతుళ్ల ఖాతాలపై నిఘావర్గాలు, సైబర్ క్రైమ్ పోలీసులు నిఘా పెట్టినట్లు ఉపాధ్యాయ వర్గాలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నాయి. కొంత మంది ఉపాధ్యాయుల ఖాతాల్లోకి ఎన్నికల డబ్బులు వస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో కేసులు నమోదవుతున్న సంఘటనలు ఉన్నాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకుంటున్న కొంత మంది ఉపాధ్యాయులు యూపీఐ పేమేంట్లు, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్లు చేయకుండా నేరుగా చేతికి డబ్బులనే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు కూడా ప్రచారంలో ఉంది. మొత్తంగా టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు ఉపాధ్యాయుల్లో ఆందోళనలు రేకెత్తిస్తున్నాయనే అభిప్రాయాలను వెలిబుచ్చుతున్నారు. సమాజం మార్గదర్శకులుగా ఉంటున్న ఉపాధ్యాయులు నిజాయితీతో ఓట్లు వేయాలని వారు నిక్కచ్చిగా చెబుతున్నారు.

నాణ్యమైన విద్యుత్‌ను అందించాలి

- ఆపరేషన్ డీఈ విజయ్


కొత్తగూడలో సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఆపరేషన్ డీఈ విజయ్

కొత్తగూడ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు ఓల్టేజీ సమస్య లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని ఆపరేషన్ డీఈ విజయ్ సూచించారు. కొత్తగూడలోని సబ్‌స్టేషన్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. విద్యుత్ హెచ్చుతగ్గుదల లోడ్‌ను పరిశీలించారు. కొత్తపల్లి, పోలారం ఫీడర్లను పరిశీలించారు. గుండం శివాలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఏఈ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి


పవన్ (ఫైల్)

సీరోలు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన సంఘటన సీరోలు మండలం కాంపల్లి శివారు బీల్యానాయక్‌తండా పరిధిలోని తునికిచెట్టు తండాలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. తునికిచెట్టుతండాకు చెందిన బానోత్ శ్రీను- అరుణ దంపతుల కుమారుడు పవన్ (19) చింతపల్లి శివారు కొత్తతండా సమీపంలో ఉన్న తమ పంట పొలానికి సాయంత్రం వెళ్లి మోటార్ పెట్టుతుండగా విద్యుదాఘాతంకు గురై అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు పవన్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు స్థానికులు తెలిపారు.

రాజోలులో వ్యక్తి..


మల్లయ్య (ఫైల్)

కురవి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కురవి మండలం రాజోలు గ్రామానికిచెందిన పాశం మల్లయ్య (55) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... పాశం మల్లయ్య గొర్రెలు కాసేందుకు వెళ్తుండగా.. ఒకరి ఇంటి వెనుక నుంచి విద్యుత్ వైరు తెగిపడడం.. ఆ వైరు నీటిలో ఉండడంతో ఆ నీటిపై నుంచి నడిచిన మల్లయ్య కు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయమై కుటుంబసభ్యులు కురవి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పోలింగ్ బూత్‌కు చేరుకున్న అధికారులు


తొర్రూరులోని పోలింగ్ స్టేషన్‌కు చేరుకున్న అధికారులు

తొర్రూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బుధవారం తొర్రూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పోలింగ్ అధికారులు విధులకు హాజరయ్యారు. తొర్రూరు డివిజన్ పరిధిలోని 7 మండలాల్లో పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తొర్రూరు ఏఈఆర్‌వో గణేష్ తెలిపారు. తొర్రూరు పోలింగ్ బూత్‌లో 315మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద నుంచి 500 మీటర్ల వరకు ఎలాంటి జిరాక్స్ సెంటర్‌లు, ఇంటర్‌నెట్ సెంటర్‌లు నిర్వహించకూడదని, పోలింగ్ స్టేషన్ వద్ద పటిష్ఠ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.

- పెద్దవంగర (ఆంధ్రజ్యోతి) : నేడు జరగబోయే వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం చేసినట్లు పీవో (ప్రొసిడింగ్ ఆఫీసర్) క్రిష్ణవేణి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె మాట్లాడుతూ మండల పరిధిలో 34 మంది ఓటర్లు అన్నారని తెలిపారు. పోలింగ్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. దివ్యాంగులకు ఇబ్బందులు కలుగకుండా, ప్రత్యేక ఏర్పాట్లును చేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై క్రాంతికిరణ్, ఆర్ఐ లష్కర్, ఏపీవో, ఎన్నికల, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



హనుమకొండ సిద్దేశ్వర ఆలయంలో భక్తుల రద్దీ



ఖిలావరంగల్ మధ్య కోటలోని స్వయంభూ శంభు లింగేశ్వస్వామి ఆలయంలో బారుల తీరిన భక్తులు

నీలకంఠుడికి నీరాజనం

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో భక్తిశ్రద్ధలతో శివరాత్రి వేడుకలు
- బ్రాహ్మీ ముహూర్తంలో అభిషేకాలు, హోమాలు
- లింగోద్భవ కాలంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం
- నేత్ర పర్వంగా రుద్రేశ్వరుడి కల్యాణం
- ప్రధాన ఆలయాల వద్ద పటిష్ఠ పోలీసు భద్రత

హనుమకొండ కల్చరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఓంకార నాదాలు ప్రతి ధ్వనించాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న అనేక శైవ క్షేత్రాలు భక్తి బావనతో పులకించాయి. శంభో శంకర.. హరహర మహాదేవ.. అంటూ భక్తులు పరమేశ్వరుడిని మనసారా కొలిచారు. మహాశివరాత్రి వేడుకలు ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రధానంగా భక్తులతో వేయిస్తంభాల ఆలయం కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన భక్తుల తాకిడి అర్ధరాత్రి వరకు కొనసాగింది. పిల్లాపాపలతో గంటల తరబడి క్యూలైన్లలో నిలబడి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం నేత్రపర్వంగా రుద్రేశ్వరుడి కల్యాణం నిర్వహించారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి, తదితర అనేక మంది ప్రజాప్రతినిధులు, అధికారులు వేడుకల్లో పాల్గొన్నారు. దేవాదాయ శాఖ ఏసీ ఆర్.సునీత ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ, ఈవో అనిల్ కుమార్‌ల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 50 మంది వలంటీర్లు సేవలందించారు. వైభవంగా సాంస్కృతిక ప్రదర్శనలు జాగరణ భక్తుల కోసం నిర్వహించారు.

హనుమకొండలోని మరో ప్రసిద్ధ శైవక్షేత్రం, దక్షిణ కాశీగా పేరొందిన సిద్ధేశ్వరాలయం కూడా భక్తుల తాకిడితో కిటకిటలాడింది. క్యూలైన్‌లలో భక్తులు నిలబడి సిద్ధేశుడిని దర్శనం చేసుకున్నారు. ఆలయ అర్చకులు సిద్ధేశుని రవికుమార్, సురేశ్ కుమార్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పశ్చిమ



వంగరలో పూజలు చేస్తున్న మంత్రి పొన్నం

ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, అనేక మంది ప్రముఖులు ఆలయాన్ని సందర్శించారు. అదే విధంగా హనుమకొండలో నూతనంగా ఆవిర్భవించిన జలేశ్వరాలయంలో కూడా భక్తుల సందడి కొనసాగింది. ఆలయ అర్చకులు శ్రీనివాస కేసరి, అంబటి రాంనారాయణ ఆధ్వర్యంలో భక్తులకు అభిషేకాలు నిర్వహింపజేశారు. రాత్రి ప్రధాన అర్చకుడు వెన్నంపల్లి జగన్‌మోహన్‌శర్మ ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. జలేశ్వరాలయ కమిటీ చైర్మన్ మట్ట శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

ములుగు రోడ్‌లోని గురుధామంలో మహాశివరాత్రి వేడుకలు పెద్ద ఎత్తున జరిగాయి. రుద్రాభిషేకాలు, గురుదేవులకు పల్లకీసేవ, శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీలు త్రిపురనేని గోపీచంద్, బండారు సాయినారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పురాణ ప్రవచకులు రాజశేఖర్, శివానందమూర్తి బోధనలను, శివ అనుగ్రహ ప్రాముఖ్యతను తెలియజెప్పారు. హనుమకొండ బ్రాహ్మణవాడలోని పంచ రామాలయంలో తెల్లవారుజాము నుంచి మొదలైన భక్తుల సందడి అర్ధరాత్రి లింగోద్భవ సమయం వరకు కొనసాగింది. సాధారణ రోజుల్లో నిశ్శబ్దంగా ఉండే చిన్న ఆలయం వందలాది భక్తులచే కిటకిటలాడుతూ కనిపించింది.

ఇండస్ ఆధ్వర్యంలో..

మహాశివరాత్రి పర్వదిన వేళ యేటా నిర్వహించే మాదిరిగా ఈసారి ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో హయగ్రీవాచారి గ్రౌండ్‌లో పెద్ద ఎత్తున ఆధ్యాత్మిక, సాంస్కృతిక సమ్మేళనాన్ని నిర్వహించారు. రాత్రి 6గంటల ప్రాంతంలో ప్రారంభమైన కార్యక్రమాల పరంపర గురువారం ఉదయం వరకు కొనసాగాయి. చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు సీఎస్ రంగరాజన్ సనాతన ధర్మ విశిష్టతను ఔన్నత్యాన్ని చాటుతూ అనర్గళంగా సాగిన ప్రవచనం, గీతాసారాన్ని కృష్ణతత్వాన్ని ప్రబోధింపజేస్తూ చిన్న వయస్సులోనే హైందవతత్వం, గీతోపదేశంపై పట్టుసాధించిన ఇస్కాన్ ప్రవచకుడు స్వామి ప్రణవానంద్ ప్రవచనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రముఖ కవి, సినీ గేయరచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వర్‌రావు తన సహజమైన పాండిత్యం, సాహిత్యంతో, జీవిత సత్యాలతో కూడిన పేరడి పాటలు, పరమశివుడి మహిమ ప్రబోధనలతో గంటకుపైగా అనర్గళ ప్రసంగం కొనసాగింది. తెలంగాణ కవి దేశపతి శ్రీనివాస్ పాట, మాట, ఇటీవల పద్మశ్రీ అందుకున్న గడ్డం సమ్మయ్య బృందంతో చిందుయక్షగాన కచేరి, మరో సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్‌తో దేశభక్తి సందేశం, గజ్జెల రంజిత్ నవ్యజల ఆధ్వర్యంలో ప్రముఖంగా పేరుగడించిన పేరిణి శివతాండవం నృత్యాలు.. ఇంకా శ్రీకృష్ణ, మాట్ల తిరుపతి, శిరీషలాంటి పేరున్న కళాకారుల పాటలు, లింగోద్భవ సమయంలో పరమశివుడి అనుగ్రహం పొందేందుకు నిర్వహించిన సప్తహారతి లాంటి కార్యక్రమాలు భక్తులను ఆసాంతం భక్తిపారవశ్యంలో ముంచెత్తి శివరాత్రి వేడుకలను సుసంపన్నం చేశాయి. బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.



ఖమ్మం అభినయ రుద్ర నాట్యాలయ గురువు ఫణిల్, శిష్య బృందాన్ని అభినందిస్తున్న ఈవో అనిల్, అర్చకుడు ఉపేంద్రశర్మ

కల్యాణం.. కమనీయం



వేయి స్తంభాల ఆలయం వద్ద శివ పార్వతుల కల్యాణంలో తాళిని భక్తులకు చూపిస్తున్న పూజారి, చిత్రంలో ఎమ్మెల్యే నాయిని, భక్తులు



రుద్రేశ్వరాలయంలో శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్న భక్తులు



ఇండస్ ఆధ్యాత్మిక సమ్మేళనం వేడుకలకు జ్యోతి ప్రజ్వలన చేస్తున్న హరీశ్‌రావు



ఐనవోలులో మల్లన్న కల్యాణం సందర్భంగా తాళి బొట్టును చూపెడుతున్న అర్చకులు

శివనామంతో హోరెత్తిన శైవక్షేత్రాలు



భూపాలపల్లి జిల్లాలో..

భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ఆలయంలో కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

భూపాలపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): శైవక్షేత్రాలన్నీ శివనామంతో హోరెత్తాయి. భూపాలపల్లి జిల్లాలోని శివాలయాలు భక్తులతో కిటకిటలడాయి. శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దక్షిణ కాశీగా పేరొందిన మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం పుణ్యక్షేత్రానికి పోటెత్తారు. గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి పరమశివుణి పూజించి ప్రసన్నం చేసుకున్నారు. ఈ వేడుకులకు ముఖ్య అతిథిగా భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ దంపతులు హాజరయ్యారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కాకతీయుల కాలం నాటి గణపురం మండలంలోని కోటగుళ్లకు భక్తులు భారీగా తరలివచ్చారు. అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, ఓఎస్‌డీ బోనాల కిషన్, డీఎస్పీ సంపత్‌రావు, సీఐ నరేష్, ఎస్సై అశోక్ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. గణపురం మండలంలో బుద్దారంలో శివరాత్రి వేడుకలకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు-పద్మ దంపతులు హాజరయ్యారు. పార్వతీ పరమేశ్వరుల కల్యాణలో పాల్గొన్నారు. అలాగే జిల్లా కేంద్రం భూపాలపల్లి, కాటారం, గణపురం, రేగొండ, చిట్యాల, మహాముత్తారం, టేకుమట్ల, మహదేవ్‌పూర్, మల్హర్, మొగుళ్లపల్లి మండలాల్లో శివారాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. శివాలయాలకు భక్తులు బారులుతీరి ప్రత్యేక పూజలు చేశారు.

మహబూబాబాద్ జిల్లాలో..

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా మహాశివరాత్రి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం తెల్లవారు జాము నుంచే భక్తులు శైవక్షేత్రాలకు చేరుకుని పూజలు నిర్వహించారు. ఆలయాలన్ని రాత్రి వరకు భక్తులతో కిటకిటలాడి శివనామస్మరణతో మార్మోగాయి. కురవి మండల కేంద్రంలోని శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాలయంలో డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జాటోతు రాంచందర్‌నాయక్-ప్రమీల దంపతులు, ఎమ్మెల్సీలు సత్యవతిరాథోడ్, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు-సంధ్యారాణి దంపతులు వేర్వేరుగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా ఎస్పీ సుధీర్‌రాంనాథ్‌కేకన్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జాతర ఏర్పాట్ల నిర్వహణ బందోబస్తును పరిశీలించారు. పెద్దవంగర మండలం చిన్నవంగరలో శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లి రామలింగేశ్వరస్వామి ఆలయంలో డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్-లక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీరోలు మండల కేంద్రంలోని శ్రీకాళేశ్వర, ముక్తేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ట్రస్టీ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెడవెల్లి రాజవర్ధన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.



కురవి వీరభద్రస్వామి ఆలయంలో భక్తుల భారీ క్యూలైన్



ఎదుర్కోలు కార్యక్రమానికి వెళ్తున్న వీరభద్రుడు, భద్రకాళి



రామప్పలో శివపార్వతుల కల్యాణానికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు తీసుకొస్తున్న మంత్రి ధనసరి సీతక్క



పాలకుర్తిలో భక్తులకు శివపార్వతుల తాళి చూపిస్తున్న పండితులు

జనగామ జిల్లాలో..

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లాలో మహాశివరాత్రి పర్వదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. శివజయంతిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా శైవక్షేత్రాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. ఓం నమః శివాయః అంటూ శివపంచాక్షరి మంత్రాన్ని జపిస్తూ భక్తులు తన్మయులయ్యారు. ఓంకార నాదంతో శైవ క్షేత్రాల పరిసరాలు మార్మోగిపోయాయి. పరమేశ్వరుడికి లింగరూపంలో రుద్రాక్షలు, మారేడు దళాలు సమర్పించి భక్తులు అభిషేకించారు. ఉపవాసదీక్షలకు పూనుకొని శివనామ స్మరణతో జాగరణలు చేపట్టారు. ప్రముఖ పుణ్యక్షేత్రాలుగా పేరొందిన కొడ్వటూరు సిద్దేశ్వరస్వామి దేవస్థానం, పాలకుర్తి శ్రీ సోమేశ్వరస్వామి దేవస్థానం, చీటకోడూరు శ్రీరామింగేశ్వర స్వామి దేవస్థానాల్లో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు సౌకర్యార్థం ఆయా దేవాలయ కమిటీలు ఏర్పాటు చేశారు.



పాలకుర్తిలో దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు



బచ్చన్నపేట సిద్దేశ్వరాలయంలో భక్తుల సందడి

పెద్దపట్నంపై శివతాండవం

ఐనవోలు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం ఐనవోలు మల్లికార్జునస్వామి శైవ క్షేత్రంలో పరమశివుని సేవలో భక్తులు పరవశించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో దేవస్థానం ప్రాంగణం కిటకిటలాడింది. మల్లన్న స్వామికి అత్యంత ప్రీతికరమైన పెద్ద పట్నంను ఒగ్గు పూజారులు ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల చూర్ణములు(పిండి) ముగ్గులతో కాకతీయులు నిర్మించిన నృత్య మండపంలో పట్నం (మండపమును) 12 అడుగుల వెడల్పు, పొడవుతో అందంగా వేశారు. మధ్యలో స్వామి, అమ్మవార్లను పూజించి అవాహనం చేసి ఒగ్గు కథ ద్వారా కల్యాణ గాధను పఠించారు. తదుపరి భక్తి పరవశంతో పట్నంపై మై మరిచి శివతాండవం నృత్యం చేశారు. వందల సంఖ్యలో పెద్దపట్నంపై నృత్యాలు చేయడం కనువిందుగా నిలిచింది. ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్, మామునూరు ఏసీపీ తిరుపతి, పర్వతగిరి సీఐ రాజగోపాల్, ఐనవోలు ఎస్సై పస్తం శ్రీనివాస్‌ల నేతృత్వంలో సుమారు 150 మంది పోలీసులు నృత్య మండపం వద్ద తొక్కిసలాట జరుకుండా కట్టడి చేశారు. నృత్యాలు చూడటానికి మండపం వద్ద భక్తులు పోటీ పడ్డారు.



ఐనవోలులో ఒగ్గు పూజారులు వేసిన పెద్దపట్నం

ఆలయాల్లో భక్తుల కోలాహలం



మంగపేటలోని వీరబ్రహ్మేంద్రస్వామి ధ్వజస్తంభం వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని రామప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

ములుగు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వ దినాన హరుడి స్మరణతో ములుగు జిల్లా మార్మోగింది. శివాలయాలు, ప్రముఖ శైవ క్షేత్రాలల్లో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. పరమేశ్వరుడిని దర్శించుకున్న భక్తులు అభిషేకాలు, అర్చనలతో కొలుచుకున్నారు. ప్రఖ్యాత రామప్ప దేవాలయంలో శివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఉదయం నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. వేలాదిగా తరలివచ్చిన భక్తులు రుద్రేశ్వరుడిని దర్శించుకొని పూజలు చేశారు. రాత్రి పార్వతీ పరమేశ్వరుల కల్యాణం కనుల పండువగా జరిగింది. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క దేవతలకు పట్టువస్త్రాలను సమర్పించారు. ములుగులోని పురాతన నగరేశ్వరస్వామి, మంగపేటలోని ఉమాచంద్రశేఖర స్వామి ఆలయాలతోపాటు ఆయా మండలాల్లోని శివాలయాలు భక్తులతో సందడిగా మారాయి. ఆలయ కమిటీలు, ఉత్సవ మండళ్ల ఆధ్వర్యంలో జాగరణ భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈసారి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించలేదు. ఆలయ ప్రాంగణాల్లో రాత్రంగా జాగరణ చేసిన భక్తులు శివపార్వతులను స్మరిస్తూ భజనలు చేశారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ములుగు
గురువారం 27 ఫిబ్రవరి 2025

సర్వం సిద్ధం

నేడే ఎమ్మెల్సీ ఎన్నికలు
- పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లిన సిబ్బంది
- జిల్లాలో తొమ్మిది పోలింగ్ కేంద్రాలు
- సామగ్రి పంపిణీని పర్యవేక్షించిన కలెక్టర్
- ఓటర్లు 628 మంది

ములుగు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జిల్లాలో గురువారం జరగనున్నాయి. ఇందుకోసం అధికార యంత్రాంగం సిద్ధమైంది. బుధవారం మధ్యాహ్నానికే ఎన్నికల సామగ్రితో సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. జిల్లా వ్యాప్తంగా తొమ్మిది పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. మొత్తం 628మంది ఓటర్లుండగా ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగనుంది. కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ కౌంటర్ల ద్వారా సిబ్బందికి బ్యాలెట్ బాక్సులు, పేపర్లు, ఇతర సామగ్రిని అధికా రులు అందజేశారు. కలెక్టర్ టీఎస్.దివాకర ఈ కార్యక్రమాన్ని పర్యవే క్షించారు. పీవో, ఏపీవో, ఓపీవో, మైక్రో అబ్జర్వర్లు, అధికారులతో మాట్లాడారు. పోలింగ్ నిర్వహణలో ఎలాంటి గందరగోళానికి గుకా వొద్దన్నారు. కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఉంటుందని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రానికీ పీవో, ఏపీవో, ఇద్దరు ఓపీవోలను నియమించారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటుహక్కును వినియోగించు కోవాలని సూచించారు ఎత్యేకంగా ఏర్పాటుచేసిన బస్సుల ద్వారా పోలీసు బందోబస్తు నడుమ తమకు కేటాయించిన పోలింగ్ కేం ద్రాలకు సిబ్బంది తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సి.హెచ్.మహేందర్‌జీ, ఓఎస్డీ గీతేమహేష్ బాబాసాహెబ్, డీఎస్పీ రవీందర్, ఆర్డీవో వెంకటేశ్, అధికారులు పాల్గొన్నారు.



ఎన్నికల సామగ్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ దివాకర, ఓఎస్డీ గీతే మహేష్


ఎన్నికల సామగ్రిని సరి చూసుకుంటున్న సిబ్బంది

200 మంది పోలీసులతో బందోబస్తు

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పోలీసు శాఖ సన్నద్ధమైంది. మావోయిస్టు ప్రభావితం ఎక్కువగా ఎక్కువగా ఉన్న వాజేడు, వెంకటాపురం, కన్నాయిగూడెం, ఏటూరునాగారం, మంగపేట, తాడ్వాయి మండలాల్లో కూంబింగ్ కొనసాగుతుండగా సరిహద్దు ప్రాంతంలో నిఘా పెంచారు. 200 మంది సిబ్బందిని బందోబస్తుకు నియమించారు. జిల్లారు ఆరు రూట్లుగా విభజించి నాలుగు స్ట్రైకింగ్‌ఫోర్స్, రెండు స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద 144సెక్షన్‌ను విధించారు.

మొక్కజొన్న రైతులకు న్యాయం చేయాలి

వెంకటాపురం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో బహుళజాతి కంపెనీలకు చెందిన మొక్కజొన్న వ్యవసాయం చేసిన బాధిత రైతులకు న్యాయం చేయాలని ఆదివాసీ నవనిర్మాణ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్సా నర్సింహమూర్తి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో రైతులతో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మొక్కజొన్న పంటలు నష్టపోయిన రైతులకు ఆ కంపెనీలు పరిహారం అందించాలన్నారు. ఈసమావేశంలో బర్లగూడెం, మహితాపురం, రాచపల్లి, ఒంటి మామిడి, వాజేడు మండలంలోని పలు గ్రామాలకు చెందిన బాధిత రైతులు పాల్గొన్నారు.

నష్ట పరిహారం చెల్లించాలి : సీపీఎం

కన్నాయిగూడెం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంతనపల్లి, ముప్పనపల్లి, బుట్టాయిగూడెం, ఏటూరు, చిట్యాల తదితర గ్రామాల్లో బాండ్ మొక్కజొన్న సాగు చేసి నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రత్నం రాజేందర్ ప్రభుతాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మొక్కజొన్న పంట వేసి నష్ట పోయిన రైతులతో ఆయన బుధవారం సమావేమయ్యారు. బహుళజాతి కంపెనీ మొక్క జొన్న విత్తనాలు సరఫరా చేసి రైతులతో ఒప్పంద వ్యవసాయం చేయిస్తూ మోసం చేస్తోందని ఆరోపించారు. ఆరుగాలం కష్టం చేసి పండించిన పంట విత్తనాలు పనికి రాకపోవడం దారుణమన్నారు. డీలర్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేసి, నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలన్నారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి సుధాకర్, సురేష్, ఇబ్రహీం పాషా, రామారావు, రైతులు బాబు, నాగయ్య, అంజయయ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

తాడ్వాయి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు గాయపడిన సంఘటనలు బుధవారం రాత్రి చోటు చేసుకున్నాయి. ప్రత్యేక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. బయ్యక్కపేట గ్రామానికి చెందిన చంద కృష్ణరావు మండల కేంద్రంలో రోడ్డు దాటుతున్న క్రమంలో ప్రైవేటు అంబులెన్స్ ఢీకొని తలకు గాయాలయ్యాయి. స్థానికులు మండలంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మరో ఘటనలో మేడారం వైపు నుంచి తాడ్వాయి వైపు వస్తున్న లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీ కొట్టింది. లారీలో డ్రైవర్‌తో ఉన్న మరో వ్యక్తికి గాయాలయ్యాయి.

మార్మోగిన శివనామ స్మరణం



కాళేశ్వరాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వివేక్, ఎంపీ వంశీకృష్ణ, సింగారం శివాలయంలో భక్తులు

మహదేవపూర్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం ఆలయంలో భక్తి పారవశ్యం వెల్లివిరిసింది. ఒకే పానవట్టంపై ఉన్న రెండు లింగాలను దర్శించుకునేందుకు భక్తజనం తండోపతండాలుగా తరలివచ్చారు. దీంతో కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయం కిటకిటలాడింది. మంగళవారం మహాశివరాత్రి వేడుకలు ప్రారంభం కాగా బుధవారం రెండో రోజు ఉదయం 4 గంటల నుంచే భక్తులు పోటెత్తారు. త్రివేణి సంగమ గోదావరిలో పుణ్యస్నానం ఆచరించి గోదావరి మాతకు చీర, సారెతో పాటు పాలు, కుంకుమతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. గోదావరిలో శివసత్తుల పూనకాలు దద్దరిల్లాయి. అనంతరం స్వామి వారి సన్నిధానంలో భక్తులు దర్శనాలు చేసుకున్నారు. సుమారు నాలుగు గంటలపాటు స్వామివారి అభిషేకం, మొక్కులు కొనసాగాయి. ఈ వేడుకలకు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ కుటుంబ సమేతంగా హాజరయ్యారు. తెలంగాణలోని నలుమూలల నుంచే కాకుండా పొరగున్న ఉన్న మహారాష్ట్రలోని సిరొంచ, గడ్చిరోలి, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

కనీస సౌకర్యాలు లేక భక్తులు ఇబ్బందులు

కాళేశ్వర ఆలయానికి దర్శించడానికి వచ్చిన భక్తులు రామాలయం నుంచి ముక్తీశ్వరస్వామి వరకు క్యూకట్టారు. ఎండ తీవ్రంగా ఉండటంతో భక్తులు క్యూలైన్‌లో ఇబ్బందులు పడ్డారు. దర్శనానికి ప్రముఖులు రావడంతో భక్తుల మధ్య తోపులాట జరిగింది. పెద్దపల్లి ఎంపీ, చెన్నూరు ఎమ్మెల్యే పూజలకు రావడంతో కొద్దిసేపు దర్శనం బ్రేక్ ఇవ్వడంతో భక్తులు నాలుగు గంటలపాటు వేచి ఉండాల్సి వచ్చింది. భక్తులకు తాగునీరు, పండ్లు అందిస్తామన్న దేవాదాయ శాఖ అధికారులు చెప్పినా వాటి దాఖలాలు కనిపించలేదు. తాగునీటికి భక్తులు గగ్గోలు పెట్టారు. ఎన్నడూ లేని విధంగా మహా శివరాత్రి జాతరకు లక్షా 50 వేల మంది భక్తులు కాళేశ్వరం చేరుకుని దర్శించుకోగా వారికి సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యారనే విమర్శలు వచ్చాయి.

కోటగుళ్లలో పోటెత్తిన భక్తులు

గణపురం (ఆంధ్రజ్యోతి): కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం (కోటగుళ్లు) శివ నామమస్మరణతో మార్మోగాయి. బుధవారం తెల్లవారుజామున నుంచే ఆలయంలో అభిషేకాలు ప్రారంభమయ్యాయి. గణపతి పూజ, అఖండ దీపారాధన, తోరణబంధనం కార్యక్రమాలను అర్చకులు నాగరాజు, శంకర్ నిర్వహించారు. అనంతరం నందీశ్వరుడికి, గణపేశ్వరుడికి రుద్రాభిషేకాలు జరిగాయి. వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావడంతో ఆలయం కిటకిటలాడింది. పర్వదినాన్ని పురస్కరించుకుని భూపాలపల్లి అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, ఓఎస్డీ బోనాల కిషన్, డీఎస్పీ సంపత్‌రావు, సీఐ నరేష్, ఎస్సై అశోక్‌తో పాటు పలువురు ప్రముఖులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి 8 గంటల సమయంలో శివపార్వతుల కల్యాణాన్ని తహసీల్దార్ అంబటి రజిత-సురేష్ దంపతులు నిర్వహించారు. అంతేకాకుండా రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఆలయ ధర్మకర్తలు అట్లూరి పావన రాజ్యలక్ష్మీ, వెంకటలక్ష్మీనరసింహారావు, డాక్టర్ లలితాదేవి-రాజేశ్వరప్రసాద్, కోడూరి నవీన్‌కుమార్- సుమతి దంపతులు పాల్గొన్నారు. అంతేకాకుండా మండల కేంద్రంలోని కాకతీయుల మరో ఆలయమైన రెడ్డిగుడి, బుద్దారంలోని పర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామి ఆలయం, చెల్పూరులోని సాంబమూర్తి ఆలయాల్లో శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుద్దారంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు-పద్మ దం పతులు కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు.

రేగొండ మండలంలో..

రేగొండ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. శివరాత్రి పుస్కరించుకుని చెన్నాపూర్‌లోని రామాలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. రేగొండ మండల కేంద్రంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు శివలింగానికి అభిషేకం చేశారు. దోపతి ఇందిర- సమ్మిరెడ్డి దంపతులు అందచేసిన మహా అన్నప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

మొగుళ్లపల్లి(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలోని శివాలయాల్లో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి మొక్కులు సమర్పించుకున్నారు. మండల కేంద్రంలోని సాంబమూర్తి దేవాలయం, పిడిసిల్లలోని శివాలయం, పర్లపల్లిలోని శివచెన్నకేశవ ఆలయం, పోతుగల్లులోని రామాలయంలో ప్రత్యేక అభిషేకాలు జరుగగా శివపార్వతుల కల్యాణాన్ని అర్చకులు అంగరంగ వైభవంగా జరిపించారు. ఆలయాల్లో దీపాలంకరణలతో శంకరుడి మనసారా వేడుకుని విభూతితో పూజలు చేసి ఉపవాస దీక్షలతో జాగరణ చేశారు. దీంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఎస్సై బి.అశోక్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు వెంకటేశ్వర్లుశర్మ, శ్రీధరాచార్యులు, రామానుంజచార్యులు, దత్తకుమార్‌శర్మ పాల్గొన్నారు.

మహాముత్తారం మండలంలో వేడుకలు

మహాముత్తారం (ఆంధ్రజ్యోతి): మండలంలోని మీనాజీపేట, సింగారం, జీలపల్లి శివాలయాల్లో శివ కల్యాణాన్ని బుధవారం వేదపండితులు జరిపించారు. భక్తులు భారీ సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు. ఆయా దేవాలయాలకు వచ్చిన భక్తులకు నిర్వాహకులు తాగు నీటి సౌకర్యంతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మీనాజీపేట ఆలయ కమిటీ చైర్మన్ మోత్కూరి రవి, గ్రామ పెద్దలు గంట్ల దేవేందర్‌రెడ్డి, మూడెత్తుల రవి, తిరుపతిరెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయానికి భారీగా భక్తుల రాక

భూపాలపల్లి కృష్ణకాలనీ (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని క్రిష్ణకాలనీ శివాలయానికి భక్తులు పోటెత్తారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురసరించుకొని ఉదయమే ఆలయానికి చేరుకొని పూజలు నిర్వహించారు. అభిషేకాలు, అర్చనలు చేశారు.

కాటారం మండలంలో..

కాటారం (ఆంధ్రజ్యోతి): మండలంలో మహాశివరాత్రి పర్వదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రజలు ఉదయాన్నే తలంటు స్నానాలు చేసి ఆలయాలకు వెళ్లి పూజలు జరిపారు. మండల కేంద్రంలోని శ్రీ అయ్యప్పస్వామి, భక్తాం జనేయస్వామి, ధన్వాడ దత్తాత్రేయస్వామి, రేగులగూడెం, గంగారం, కాటారం, గూడూరు, గంగపురి, దామెరకుంట ఆంజనేయస్వామి, పోతులవాయి సాంబ శివుడి ఆలయాల్లో వేదపండితులు మహాన్యాసక పూర్వక ఏకాదశ రుద్రాభి షేకాలు, సహస్రానామార్చన, బిల్వార్చన నిర్వహించారు. శివ, పార్వతుల కల్యాణం కనుల పండవుగా జరిపారు. అర్ధరాత్రి ఆలయాల్లో లింగోద్భవ పూజలు ఘనంగా జరిగాయి. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మహిళలు ఉపవాసాలు, జాగారాలు ఉండి పరమ శివుడిని ఆరాధించారు. ఈ కార్యక్రమాల్లో వేదపండితులు కృష్ణమోహన్, గణేష్, ప్రవీణ్, సుమిత్‌పాండే, లక్ష్మికాంత్, సురేష్,

వైభవంగా మహాశివరాత్రి వేడుకలు


వాజేడు మమండలం అయ్యవారిపేటలో పూజులు నిర్వహిస్తున్న పేరూరు ఎస్సై

వెంకటాపూర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రామప్ప రామలింగేశ్వరస్వామి సన్నిధి బుధవారం భక్తులతో పోటెత్తింది. వరంగల్ ఉమ్మడి జిల్లా నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు రామలింగేశ్వరుడి సన్నిదిలో ప్రత్యేక పూజలు చేశారు. ఉపవాసదీక్ష చేపట్టిన భక్తులు పప్పు, బెల్లం కొనుగోలు చేశారు. రామప్ప జాతరకు గుర్తుగా మహిళా భక్తులు గాజులు ధరించారు. భక్తులకు చలువ పందిళ్లే దిక్కు అయ్యాయి. గంటల తరబడి దర్శనం కావడంతో క్యూలైన్‌లో భక్తులు కుప్పకూలిపోయారు. కొందరు సొమ్మసిల్లి పడిపోయినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. నాలుగైదు జిల్లాల నుంచి భక్తులు పెద్దఎత్తున చేరుకుని ఉత్సవాల్లో పాల్గొనడంతో రామప్ప ఆలయ పరిసరాలు భక్తజన తాకిడితో కిక్కిరిసిపోయాయి. ఆలయంలో రామలింగేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు ఎక్కువ సంఖ్యలో రావడంతో ఎలాంటి ఇబ్బందులు కలగకుంగా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. లయన్స్‌క్లబ్ వారు తాగునీటిని ఉచితంగా పంపిణీ చేశారు. ఉత్సాహంగా రామప్పకు చేరుకుని ఉపవాసాలు, జాగరణతో రాత్రంతా గడిపారు. రామప్ప ఆలయంలో భక్తుల తాకిడి ఎక్కువగా ఉండడంతో అర్చకులు హరీశ్ శర్మ, ఉమాశంకర్, రాజ్‌కుమార్, ఎనిమిది మంది అర్చకులు స్వామివారిని అభిషేకించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రామలింగేశ్వర స్వామి సన్నిధిలో బుధవారం ఉదయం 6గంటల నుంచి మహాశివరాత్రి పూజలు కొనసాగుతున్నాయి. ఈసందర్భంగా భక్తులు కుటుంబ సమేతంగా రామప్పకు విచ్చేసి రామలింగేశ్వరుడికి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు నిరంతరం భక్తులకు అర్చనలు, రుద్రాభిషేకాలు చేసి తీర్థప్రసాదాలు అందజేస్తున్నారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ కవిత, ఈవో బిల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

భక్తుల కోసం వైద్య శిబిరం ఏర్పాటు

డీఎంహెచ్‌వో గోపాల్‌రావు ఆధ్వర్యంలో మండల వైద్యాధికారి చీర్ల శ్రీకాంత్ పర్యవేక్షణలో డాక్టర్లు రిషిత, లోకప్రియ, పీహెచ్ఎన్ శోభ, ఏఎన్ఎంలు సులోచన, రజిత, సుశీల, ఆశా కార్యకర్తలు సుమారు 300మందికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా రామప్పలో భక్తులను ఉత్సాహపరచడానికి ఏర్పాటుచేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. రామప్పకు వచ్చే భక్తులు, పిల్లలు ఎక్కడైనా తప్పిపోతే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరుతూ ఆలయ గార్డెన్‌లో ములు గు బాలల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేశారు. లీగల్ కమ్ ప్రొఫెషన్ ఆఫీసర్ సంజీవ్, సఖి లీగల్ కౌన్సిల్ ప్రసాద్, కేస్ వర్కర్‌లు రజిత, మౌనిక, తదితరులు పాల్గొన్నారు. భూపాలపల్లి సింగరేణి ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో రామప్పలో భక్తులకు అందిస్తున్నారు.

ఘనంగా ప్రత్యేక పూజలు

వెంకటాపురం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉమారామ లింగేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రి వేడుకలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. శివపార్వతుల కల్యాణాన్ని తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మండల కేంద్రంలోని శివాల యం సమీపంలో బుధవారం ఎస్సై కొప్పుల తిరుప తిరావు ఆధ్వర్యంలో పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. శివాల యం సమీపంలో మలుపు ఉండడంతో వాహనాలు వేగంగా రావడం వల్ల ప్రమాదాలు జరుగుతుండడంతో ఈ చర్యలకు చేపట్టారు.

వాజేడు మండలంలో మహాశివరాత్రి

వాజేడు (ఆంధ్రజ్యోతి): మండలంలో మహాశివరాత్రి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని అయ్యవారిపేట, ప్రగళ్లపల్లిలో ఉన్న శివాలయాల్లో భక్తులు వేకువజామునుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని జంగాలపల్లిలో ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో సైతం భక్తులు పూజలు నిర్వహించారు. బుధవారం రాత్రి ప్రగళ్లపల్లి, వాజేడులలో శివ పార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించేందుకు నిర్వహకులు ఏర్పాట్లు చేశారు. అయ్యవారిపేట శివాలయంలో పేరూరు ఎస్సై కృష్ణప్రసాద్ గ్రామస్థులతో కలిసి పూజలు నిర్వహించారు.

ఏటూరునాగారం మండలంలో..

ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ ఉమ రామలింగేశ్వ స్వామి శివాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామివారికి సహస్ర ఘటాభిషేకం, శివలింగం పంచామృత అభిషేకం కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. అర్చకులు రాజ్‌కుమార్, భరత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. మండలంలోని రామన్నగూడెం, ముల్లెకట్ట వద్ద గోదావరికి వెళ్లి భక్తులు పుణ్యస్నానాలను ఆచరించారు. శివాలయ ఆలయ కమిటీ చైర్మన్ మణుగూరు ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు వలస తిరుపతి, ఇరుసవల్లి కిరణ్, కటుకూరి రాధిక, దుర్గం కొమురయ్య, రామ్‌లాల్, పాలకుర్తి పాలన్న, వేణుగోపాల్, రాంబాబ పాల్గొన్నారు.

తాడ్వాయి మండలంలో..

తాడ్వాయి (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా శివరాత్రి ఉత్సవాలు శివాలయాల్లో ఘనంగా జరిగాయి. ఆయా దేవాలయల ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఈ పర్వదినాన్ని నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

మంగపేట మండలంలో..

మంగపేట (ఆంధ్రజ్యోతి) మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని శైవ క్షేత్రాలు శివనామాస్మరణతో మార్మోగాయి. మండల కేంద్రంలోని శ్రీ ఉమాచంద్ర శేఖరస్వామి, మల్లూరులోని శ్రీ శంభులింగేశ్వరస్వామి, దేవనగరం శివారులోని శ్రీ కొండ లింగేశ్వరస్వామి దేవాలయాల్లో మహాన్యాస పూర్వాహక రుద్రాభిషేకాలు అత్యంత వైభవంగా జరిగాయి. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఉమాదేవి (పార్వతిదేవి) చంద్రశేఖరస్వామి (శివుడు) ఉత్సవమూర్తులకు కల్యాణ క్రతువును ప్రధానార్చకుడు విస్సావఝ్జుల నరేష్‌శర్మ ఆధ్వర్యంలో అర్చకులు యువన్‌శర్మ నిర్వహించారు. కమలాపురం, మంగపేట, బోరునర్సాపురం, మల్లూరు, పాలాయిగూడెం, వాడగూడెం, రమణక్కపేట, రాజుపేట, దేవనగరం, కత్తిగూడెం, అకినేపల్లి- మల్లారం తీర గ్రామాల ప్రజలు గోదావరిలో ఉదయాన్నే పుణ్య స్నానాలు ఆచరించారు. శ్రీ సీతారామా చంద్రస్వామి, శ్రీ వేణుగోపాలస్వామి, శ్రీ ఆంజనేయస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకలలో ఆలయ కమిటీ చైర్మన్ కొలగట్ల నరేష్‌రెడ్డి, దేవస్థానం కమిటీ సభ్యులు, వ్యాపారులు, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీషర్టులు పంపిణీ చసిన సూర్య

తాడ్వాయి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంబాపూర్, లింగాల గ్రామాల్లో మహా శివరాత్రి సందర్భంగా బుధవారం నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో క్రీడాకారులకు యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ధనసరి సూర్య టీషర్టులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ములుగు నియోజకవర్గ యువజన అధ్యక్షుడు సుమన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, మేడారం జాతర మాజీ చైర్మన్ అరెం లచ్చుపటేల్ తదితరులు పాల్గొన్నారు.

రెండో సీమ్ ప్రైవేటీకరణ చేయొద్దు : ఏఐటీయూసీ

గణపురం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి సింగరేణి ఏరియా గణపురం మండలం బస్వరాజుపల్లి కాకతీయ లాంగ్‌వాల్ ప్రాజెక్టు (8 ఇన్‌క్లైన్) గని రెండో సీమ్‌ను ప్రైవేటీకరణ చేయొద్దని ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి మోటపలుకుల రమేష్ డిమాండ్ చేశారు. సీమ్‌లను ప్రైవేటీకరణ చేస్తే డిపెండెంట్ ఉద్యోగాలు పోవడమే కాకుండా సంస్థ ఆర్థిక నష్టాల్లో కూరుకుపోతుందన్నారు. అనంతరం గని మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజేందర్, సుధాకర్, జగత్‌రావు, కృష్ణారెడ్డి, శ్రీనివాస్, హరీశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో హెచ్ఎం మృతి

కన్నాయిగూడెం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుపాకులగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొర్నిబెల్లి రాఘవరావు (59) గుండెపోటుతో మృతి చెందారు. .తాడ్వాయి మండలం కామారం గ్రామానికి చెందిన ఆయన తుపాకులగూడెం ఆశ్రమ పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్నారు. ఈ నెల 9న స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ క్రమంలో అస్వస్థతకు గురయ్యారు. హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు.


రాఘవరావు (ఫైల్)

ఎమ్మెల్సీ ఎన్నికలకు రెడీ

(5వ పేజీ తరువాయి)

ఎన్నికల విధుల్లో మొత్తం 99 మంది సిబ్బంది పాల్గొనున్నారు. వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎన్నిక విధుల్లో 44 మంది, మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ ఉపాధ్యాయ, పట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో 55 మంది సిబ్బంది పా ల్గొంటున్నారు. ఎన్నికల నిర్వహణకు మొత్తం నాలుగు రూట్లుగా విభజించారు. వీటికి లైజన్, రూట్ అధికారులను నియమించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

చిట్యాల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : క్షణికావేశంలో పురుగుల మందు తాగి మృత్యువుతో పోరాడిన యువకు డు చివరికి తనువు చాలించి తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెంచరామి గ్రామానికి చెం దిన దాసరి వాణి, యుగేందర్ దంపతులకు కుమార్తె, కు మారుడు రక్షిత్‌కుమార్ (18) ఇద్దరు సంతానం. రక్షిత్‌కు మార్ ఓ జూనియర్ కాలేజీలో ప్రవేశం పొంది తరగతుల కు హాజరు కాకుండా గ్రామంలోనే కూలి పనులు చేసు కుంటున్నాడు. ఈక్రమంలో గత నెల 24న తల్లిదండ్రులు గొడవ పెట్టుకోవ డంతో మనస్తాపానికి గురైన రక్షిత్ కుమార్ ఇంటి వద్ద ఉన్న పురుగుల మందు తాగాడు. దీంతో కుటుంబ సభ్యులు అతడిని హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. 10 రోజులు చికిత్సపొందిన యువకుడి ఆరో గ్య పరిస్థితి విషమించడంతో కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ నెల రోజులపాటు చికిత్స పొందిన రక్షిత్‌కుమార్ ఆరోగ్య పరిస్థితి విషమించి మంగళవారం రాత్రి మృతి చెందాడు.

మంత్రాల నెంపతోనే వృద్ధురాలి హత్య

అనుమానాస్పద మృతిపై వీడిన మిస్టరీ


హత్య కేసు నిందితుల అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ సంపత్‌రావు

చిట్యాల, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): టేకుమట్ల మండలంలో ఇటీవల అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతి చెందిన కేసు మిస్టరీ వీడింది. మంత్రాల నెపంతోనే ఆమెను హత్య చేసి బావిలో పడేశారని పోలీసులు తేల్చారు. చిట్యాల పోలీస్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ సంపత్‌రావు వివరాలు వెల్లడించారు.

టేకుమట్ల మండలం బోయినపల్లి గ్రామానికి చెందిన బోయిన మల్లయ్య కుమార్తె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. చికిత్స చేయించినప్పటికీ నయం కాలేదు. దీనికి అదే గ్రామానికి చెందిన స్వకపాక వీరమ్మ(70) కారణమని, ఆమె మంత్రాలు చేయడం వల్లే తన కూతురి ఆరోగ్యం కుదట పడటం లేదని మలల్లయ్య అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో వీరమ్మను హత్య చేసేందుకు రెండు నెలలుగా ప్రయత్నిస్తున్నాడు. ఈ నెల 19న టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లిలో చింతపండు విక్రయించేందుకు వీరమ్మ వెళ్లింది. సాయంత్రం తిరిగి ఇంటికి వెళ్తుండగా మల్లయ్య, అతడి బంధువులు పుట్టకొక్కుల శ్రీనివాస్ అలియాస్ కిట్టు, మద్దెల సిద్ధు ఆమెను పట్టుకొని గొంతు నులిమి హత్యచేశారు. ఆమె వద్ద ఉన్న రెండు తులాల బంగారం, 30 తులాల వెండి ఆభరణాలు అపహరించి మృతదేహం చేతులను తాళ్లతో కట్టేసి పక్కనే ఉన్న బావిలో పడేశారు. రెండు రోజుల అనంతరం దుర్వాసన రావడాన్ని గ్రహించిన ఆ గ్రామానికి చెందిన రైతులు బావిలో తేలియాడుతున్న వీరమ్మ మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు సీసీ కెమెరాల సహాయంతో కేసును చేధించారు. నిందితులు ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించిన సీఐ మల్లేష్, టేకుమట్ల ఎస్సై సుధాకర్, ఏఎస్సై అమరేందర్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్స్ మహేందర్, నాగరాజు, రంజింత్, సతీష్‌ను డీఎస్పీ అభినందించారు.